గుండెలు గతుక్కుమన్నాయి. తనకొడుకు, భార్య చివరికి యిలా తయారయినందుకు యేడ్చాడు, యిన పెట్టెను కావలించుకుని భోరుమన్నాడు.

మర్నాడు సాయంత్రం తన స్నేహితుణ్ణి చూచివద్దామని బయలుదేరాడు. గంగోదకాన్ని యింకా తినుబండారాల్ని పట్టుకుని వీరాస్వామి గుమ్మంలో అడుగుపెట్టాడు. అతని భార్య ధనరాజుని చూచి పలకరించింది.

"యాత్ర జయప్రదంగా సాగిపోయిందా?"

"ఆఁ వీరాస్వామి "

"వచ్చేశారు. సగందారినుండే తిరిగి వచ్చేశారు పెరట్లో మొక్కలకి గొప్పు త్రవ్వుతున్నారు."

"అరే - అక్కడ దేవాలయంలో అవుపించాడు- యిక్కడ యెలావున్నాడు. ఇదేదో విచిత్రంగా వుందే—"అన్నాడు.

"రండి లోపలికి రండి—" పెరట్లోకి తీసుకెళ్ళింది ధనరాజుని, సీతమ్మ.

"ఓహో! యెప్పుడు రావడం?—" పలకరించాడు వీరాస్వామి.

"నిన్న సాయంత్రం. కాని..."

"ఏమోయ్! అలా కంటతడిపెడుతున్నావ్?"

"చూసేవుగా మా వాళ్ళ సంగతి?"

"అవన్నీ పట్టించుకోకు. మనకి ప్రాప్తంలేదు అంతే."

"ఐతే ఆపూరినుండి తిరిగొచ్చేవన్న మాట."

"అవును. నాదగ్గరున్న సొమ్ము వాళ్ళకిచ్చేశాను. వాళ్లు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. కాని చాలా మంచివాళ్లు. మానవసేవే మాధవసేవ. అంచేత బీదవాళ్లకి సహాయంచేస్తే ముక్తి వుంటుందని అలా చేశాను. దేవుడికిస్తే మాత్రం అతడు తింటాడా?"

"నేను యెంతో శ్రమపడ్డాను. చివరికి ఏమీ సాధించలేకపోయాను. అందుకే నీ ప్రతిబింబం ప్రతి దేవాలయంలోనూ అవుపించింది."

---

కథానిక

# ఎండమావుల అన్వేషణ

భాగవతుల సూర్యనారాయణశాస్త్రి

అందరూ అందరితో మాట్లాడరుగాని కొందరు కొందరితోనే మాట్లాడుతారు. అందరూ అన్నీ మాట్లాడరుగాని కొందరు కొన్నే మాట్లాడతారు—అందరితో అన్నీ మాట్లాడటం అనేది, జంతరమంతరజాణాలైనవారికే చేతనవుతుంది.

అలాంటివాళ్లు సాధారణంగా ఎదటివాళ్ళకి అర్థంకాకుండా పూచీ, పేచీలేని పద్ధతిలో మాట్లాడుతారు. ఇదంతా ఆ ముసలాయనతో పరిచయమైనతర్వాత నా వూహాకందిన విషయం. అసలు జరిగిందేమిటంటే—

ఆ ముసలాయన నన్ను చూసి నవ్వేడు. ఎందుకు నవ్వేడో తెలీదు. ఇంతకూ, ఆ ముసలాయన ఎవరో తెలిస్తేగా, ఎందుకునవ్వేడో తెలీడానికి. నాకే ఆశ్చర్యం అయింది. ఎమంటే—

నేను ఆవూరువచ్చి అప్పటికి, గట్టిగా మూడు వారాలేనా కాలేదు. అయినా, ఆవూరు మొత్తాన్ని నన్నెరిగున్నవాళ్లుండరని నాకు బాగా తెలుసు. పోతే—

నేను చూడకపోయినా, ఈ మూడువారాల్లో ఆ ముసలాయన నన్ను చాలాసార్లు చూసివుండాలి. అయితేమాత్రం——

నన్ను చూసి నవ్వాల్సిన అగత్యమేమొచ్చింది. ఇంతకూ, ఆయన ఎవరు? అన్న అనుమానం పీక్కుతింటోంది. అడిగితే తేలిపోతుందిగా!

వెంటనే ఆయనదగ్గరికివెళ్ళి "ఏమండీ! నన్ను మీరెరిగున్నారా?" అని అడిగేను. లేదన్నట్టు తలూపాడు. అయితే నన్ను చూసి ఎందుకు నవ్వారు?" అని అడిగితే— "ఊఁ! తెలుసు" అన్నాడు.

బాగా పళ్ళుగడిచి, మంచి అనుభవం గడించినవాడుకదా! తెలుసనని ఓమారు, తెలీదని ఒకమారూ అంటూ-ఇలా మాట్లాడుతాడేమిటా! అనిపించింది.

మనసుండబట్టలేక మొహంమీదే అనేశాను— "ఏమండీ మీకు తెలిసిందేమిటో, తెలీనిదేమిటో నాకేంబోధపడలేదు; కొంచం విడమర్చిచెప్పండి."

దానికి ఆ ముసలాయన "నిజమే! నేనూ అలాగే అనుకుంటున్నా-కాని, బోధపడడంలేదు" అన్నాడు.

ఆ సమాధానం నాకు నచ్చకపోవడాన్ని, అంతు తేలుతుందేమోనని అరగంటపైగా బాతాఖానీ కొట్టేను. కాని, చిత్రం ఏమిటంటే, ఆ అర గంటా ఆయన ధోరణిమాత్రం అదే ఫక్కీలో నడచింది.

సరే. ఆయనపద్ధతే అంత కాబోలునని నాలో నేనే సమాధానపడి కదలబోయేసరికి, వున్నవాడు వూరుకోకుండా-"రేపు మా ఇంటికొస్తే తీరికగా మాట్లాడుకుందాం" అన్నాడు, సరే అదీచూద్దాం అనుకొని నా దోవని నేను పోయేను.

ఎలా అయితేనే మర్నాడు-"రాజా! రాజా! ప్రధాని ఇల్లెక్కడ?" అన్న పద్ధతిలో, వాళ్ళింటికి వెళ్ళేను. కాని, ప్రయోజనం శూన్యం.

"ఏంచేస్తాం?" అనుకొని, రైలుతప ్పినవాడి మొహంతో, తిరిగివచ్చేశాను. ఆ తర్వాత ఆ సంగతే మర్చిపోయేను. కాని—

మళ్ళా పదిరోజులతర్వాత, ఒకనాటి సాయంత్రం దీపాలవేళని, ఆ దారినేపోతున్న నన్నుచూసి ఆ ముసలాయనపిల్చేడు. దగ్గరికెళ్ళి "నమస్కారమండీ?" అన్నాను. "బాబూ? నమస్కారం" అన్నాడు ఆయన కూడా.

ఆ ముసలాయన వాళ్ళ అరుగుమీద కూర్చున్నాడు. ఆ అరుగు చాలా విశాలంగా వుంది. ఆయనతోబాటు ఇంకో నలుగురుకూడా కూర్చుని వున్నారు.

వాళ్ళు అయిదుగురు విచిత్ర మనుష్యుల్లా ఉన్నారు. (ఏమంటే- అంతా ఆయనలాంటి వాళ్ళే ఇక ముసలాయన సంగతి వేరే చెప్పాలా!

ఈ విషయాలన్నీ నిదానంగా తేలిసేయి. కాని అప్పటికి ముసలాయన పలకరించి ఊరుకోగా నేను కూడా వాళ్ల పక్కనే కూర్చున్నా. ముసలాయన నావైపు చూస్తూ,"ఏం" అన్నాడు.

ఈదెబ్బతో నాకు ముసలాయనమీద కొట్టొచ్చినంత కోపం వచ్చింది. రాదూ మరి! లేకపోతే పోయేవాడిని పోనివ్వకుండా దగ్గరకు పిల్చి, ఉత్తరంలేక పూర్వంలేక "ఏం" అంటాడా? అలా అనడంలో ఉద్దేశమేమిటి?

ఎంత తమాయించుకుని ఆలోచించినా అర్థం కాలేదు. తెగించి అడిగేశాను, "మీ ఉద్దేశంలో 'ఏం' అంటే అర్థమేమిటి?" అని. సమాధానంగా తల పంకిస్తూ నవ్వేసి వూరుకున్నాడు.

నేనుమాత్రం వూరుకోలేక "అంతకూ అసలు మీ పద్ధతి ఏమిటి?" అని అడిగేను. రేపువస్తే చెప్తానన్నాడు. సరే. దీని ఆరాతీసి అంతుఏమిటో రేపు తేల్చాలనుకొని అప్పటికి వెళ్ళిపోయాను.

మర్నాడు సరిగ్గా అదే వేళకు వెళ్ళేను. మామూలుగా వాళ్లయిదుగురూ కూర్చున్నారు. నేను కూడా కూర్చున్నాను. కొంతసేపటి వరకూ ఎవరమూ మాట్లాడలేదు, చివరికి నేనే కదలేశా, "ఏమండీ! రేపువస్తే చెప్తానన్నారుకదూ?" అంటూ. అందుకా ముసలాయన తొణక్కుండా బెణక్కుండా "అవును రేపు" అన్నాడు.

ఈ మాటతో నా ఒళ్ళంతా కంపరమెత్తింది, "ఏమండీ! నిన్ననూ రేపు అని, ఇవాళా రేపు అంటే-ఏ రేపు?" అన్నాను విసుగ్గా. వెంటనే మిగతా నలుగురిలో ఒకాయన (అంటే ముసలాయనతో మాట్లాడే ఆయన) సిగరెట్టు తీసి ముట్టిస్తూ "ఫర్వాలేదే" అన్నాడు నవ్వుతూ. ముసలాయన కూడా నవ్వుతో తలపంకిస్తూ, "మరేమిటనుకున్నావు!" అన్నాడు కనుబొమ్మ లెగరేసి. ఇదంతా అయోమయంగా ఉండి బిత్తరపోయి చూస్తున్నాను.

కొంతసేపటికి ముసలాయన నాకేసి చూసి, "ఏమండీ!" అన్నాడు; నేనుకూడా ఆయనకేసి చూసి "ఊ!" అన్నాను. ముసలాయన మళ్ళీ అందుకొని "రేపు అంటే నిజంగా మీకు తెలీదా? ఐతే వినండి" అంటూ,

"వున్నంతవరకూ సేపు; ఆ తర్వాత రేపు-రేపుకి కాపుదల (అవసరం) లేదు. ఇంతకన్నా నన్ను రేపకండి" అన్నాడు.

ఆయన చెప్పినదానికి అర్థం ఏమిటో, ఆవగింజలో అరవయ్యోవంతు కూడా తెలీలేదు. వుప్పూ, వడ్లూ గుచ్చెత్తినట్టుగావున్న ఈ ధోరణి ఏమిటా అని దిక్కులుచూస్తూ, చుక్కలు లెక్కపెడ్తూ కొంతసేపటివరకూ మాట్లాడలేకపోయేను.

చివరికి-ఆ ముసలాయన ఇకమీదట కదుపించినా సరే మాట్లాడకూడదని నాలో నేనే

అనుకున్నాను. అయినా చేవలు దేరిన శరీరం, చక్కగా మెలికలుతిరిగిన కండలతో సుద్రంగా ఉంద్రంముక్కలా వున్న ఆ ముసలాయన ఏం పని చేస్తున్నాడో ఏమిటో అడగా లనిపించింది. అడిగేనుకూడా "ఏమండీ! మీరు ఏంపని చేస్తు న్నారు?" అని.

"ఏమీలేదు" అన్నాడు ఆయన. "అంటే" అన్నాను; "అంతే" అన్నాడు.

ఇక ఇలా లాభంలేదు, కవ్విస్తేకాని తేలదు అనుకొని "పొద్దు గడిచే అందుకుగాని పొట్ట గడిచే అందుకుగాని ఏదో ఒకటి చెయ్యాలికదా? అలాంటప్పుడు మీరు ఏమీ లేదంటారేమిటి?" అని అడిగేను.

"చూడండి బాబూ! జీతానికీ, జీవితానికీ లంకెపెట్టుకుంటికి వీలులేదు కదా? పైగా అందువల్ల చిక్కేగాని సంతృప్తి ఏముంటుంది చెప్పండి. మరి అలాంటప్పుడు ఏం చేస్తేమాత్రం ప్రయోజన మేమిటీ?" అన్నాడు.

ఆయన ముందర నా పాచిక పారకపోయినా ప్రయత్నం మానలేదు.

"కవిత్వం రాస్తారా అండీ?"

"అబ్బే!—కవిత్వం రాయడానికి కళ్ళకికూడా అందని కళావిశిష్టతని కాగితాల కెక్కించగల సమర్థులు రాస్తేనే దాని సొగసు."

"నాట్యం చేస్తారా?"

"ఇంకా నయం, గట్టిగా అనేరండోయ్! అప్పుడే ఈడేరిన భోగప్పడుచు నాట్యంచేస్తేనే బాగుంటుంది కదూ!"

"లేకపోతే—పాటలు పాడుతారా?"

"ఊహు! అవి మాత్రం తక్కువా? పాట లన్నవి, కమ్మని కంఠంగల కాంతల సొత్తుగాని మరొకళ్లది కాదుకదా?"

"ఏదీ కాకపోతే, గుమాస్తాపని చేస్తున్నా రన్నమా?ట"

"అదేమిటండీ అలా అంటున్నారు? గుమాస్తా పనిని కాలంలోవున్న కుర్రాళ్ళు చేస్తే ఫలంపాటు గాని — నాలాంటివాళ్లు చేస్తే ప్రయోజనం ఏమిటి?"

సంభాషణ సాగిందికాని సమాధానాలు నాకు నచ్చలేదు. పైగా, చెప్పకుండా తప్పించుకునే ఎత్తు వేశాడని అనుకున్నాను. అయినా మనసుండ బట్టక "మీరు మాట్లాడేభాష ఏమిటో నాకేమీ అర్థంకాలేదు" అన్నాను.

అప్పుడా ముసలాయన "నిజమే! అర్థంకాలే దంటే మీతప్పుకాదు లెండి. ఎంచేతంటే—ఒక్క ప్పుడు పృథివిలో మానవులంతా ఒక్కవాతావర ణంలోనే వుంటూ, ఒక్కభావానికి ఒక్కపదమే వాడుతూ, అందరూ ఒక్కమోస్తరు భాషనే మాట్లాడేవారు. కాని ఇప్పుడు రకరకాల వాతా వరణాల్లో, రకరకాల భాషలు మాట్లాడుతూ, ఒక్కపదాన్నే అనేక భావాలుగా వుపయోగించు కుంటున్నారు. అంచేత చెప్పేవాడు ఒక భావంతో చెప్తే, వినేవాడు మరొకభావంతో అర్థంచేసుకోవడం జరుగుతోంది. కనుక భాష బ్రతికితేనేగాని మానవుడిఘోష మానవుడికి అర్థం కాదు" అన్నాడు.

ఇదంతా జాగ్రత్తగా విని "అయితే ఎలాంటి పరిస్థితుల్లో భాష బ్రతుకుతుందో చెప్తారా?" అన్నాను.

"ఏమిటో బాబూ! ఆకాశమంత ఎత్తూ, సముద్రమంత లోతూ, భూమంత విస్తీర్ణం వున్న భాషని గురించి ఏ పరిస్థితుల్లో బ్రతుకుతుందో మనంమాత్రం ఏం చెప్పగలం? ఆ మాటకొస్తే— ఇప్పటివరకూ బ్రతకనిభాషే వుందని చెప్పడం కూడా తప్పేనేమో!" అన్నాడు పెదవివిరుస్తూ.

ఆ తర్వాత నేను వాళ్ళింటికి వెళ్లకపోయినా, ఆయనగురించి తెలిసిన విషయం ఏమిటంటే—

ఆయన ఒక కళాజీవిట; తాను నమ్మిన కళ కోసం, తా నారాధించిన కళకోసం, అదేపనిగా ఆలోచిస్తూ వుంటాడు. అందుచేత — ఆయన కోటానుకోటితో కొల్లలునా మాట్లాడుతున్నా, ఆ మాటలు మాటలకే వాపృట. కానీ, ఒక్క విశే షం, నాటికీ నేటికీ ఆయన నిజంగా మాట్లాడేది ఒకే ఒక్క మనిషితోనట!

ఆయన్ని గురించి ఇలా తెలిసినప్పటికీ నేనేం ఆశ్చర్యపడలేదు; పైగా ఇలాంటివాళ్లు కూడా ఉన్నారుకదా అని సంతృప్తి పొందేను. కాని ఆయన మాట్లాడే ఆ ఒక్క మనిషి ఎవరో? ఏమిటో?